సాక్షి
కామారెడ్డి
శనివారం, 1, ఫిబ్రవరి, 2025



రహదారి భద్రత..

రహదారి భద్రత అందరి బాధ్యత అని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



తాగునీటి సమస్య తలెత్తకుండా..

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ప్రత్యేకాధికారులు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.8 /15.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

నెత్తుటి మరకలు

■ మాచారెడ్డి మండలం ఎల్లంపేటకు చెందిన మమతకు సిరిసిల్ల జిల్లాకు చెందిన స్వామితో వివాహమైంది. ఇరువురి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతుండడంతో మమత తల్లిగారింటి వద్దే ఉంటోంది. గత నెల 21న మాట్లాడేందుకు వచ్చిన స్వామిపై మమత తండ్రి దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన స్వామి చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ కేసులో స్వామి మామ ఎల్లయ్యతో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

■ రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో జనవరి 18న పొక్కిలి రవి (41) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. భూ వివాదంలో రవి సోదరుడు, సోదరుడి భార్య, సోదరుడి కుమారుడు, మరో ఇద్దరు కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు పోలీసుల విచారణలో తేలింది.

■ నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలో టేకుల్ల మైసయ్య (41) అనే వ్యక్తి గతనెల 21న హత్యకు గురయ్యాడు. మైసయ్యను భార్య, మరొకరు కలిసి హతమార్చినట్టు పోలీసులు తేల్చారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని వెల్లడైంది.

■ భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన మాలె నారాయణ (42) కనిపించడం లేదంటూ అతడి భార్య ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అనుమానించి నారాయణ భార్యతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా సంగారెడ్డి జిల్లాలో హతమార్చినట్టు ఒప్పుకున్నారు. దీంతో నారాయణ భార్యను, ఆమెకు సహకరించిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.



మానవత్వం మంటగలుస్తోంది. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోతున్నాయి. భూములు, ఆస్తుల విషయంలో జరిగే గొడవలు, వివాహేతర సంబంధాలు హత్యలకు దారితీస్తున్నాయి. చాలా కేసుల్లో రక్త సంబంధీకులే నేరస్తులుగా తేలుతున్నారు. తండ్రిని కొడుకు, కొడుకును తండ్రి, భర్తను భార్య, భార్యను భర్త... ఇలా కుటుంబ సభ్యులే హతమారుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

- కుటుంబ తగాదాలు, వివాహేతర సంబంధాలతో హత్యలు
- ఆస్తుల వివాదాల్లోనూ దారుణాలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో హత్యలు పెరుగుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట గొడవలు జరగడం సర్వసాధారణమయ్యింది. కొన్ని సందర్భాల్లో ఇరు వర్గాలు దాడులు చేసుకుంటున్నారు. మరికొన్ని సంఘటనల్లో చంపుకోవడానికీ వెనుకాడడం లేదు. ఒక దారుణం జరిగి దానికి సంబంధించిన విచారణ పూర్తవకముందే మరో కేసు వెలుగులోకి వస్తోంది. 2023 సంవత్సరంలో జిల్లాలో 28 హత్యలు జరగ్గా.. 2024 సంవత్సరంలో 37 మర్డర్ కేసులు నమోదయ్యాయి. ఇది ఆందోళన ఆందోళన కలిగిస్తోంది.

కారణాలెన్నో..

గతేడాది జిల్లాలో 37 హత్య కేసులు నమోదయ్యాయి. ఇందులో పది హత్యలు కుటుంబ తగాదాల నేపథ్యంలో జరగ్గా.. ఆరు వివాహేతర సంబంధాలు, నాలుగు ఆస్తి తగాదాలు, రెండు భూ తగాదాలు, రెండు పాత కక్షలు, ఒకటి ప్రేమ వ్యవహారంలో, మరికొన్ని ఆకస్మికంగా చోటు చేసుకున్నాయి. ఆస్తుల విషయంలో కొందరు తోడబుట్టిన వారిని కాటికి పంపడానికీ వెనుకాడడం లేదు. అన్నదమ్ములు, తండ్రీకొడుకులు, దాయాదుల మధ్య కూడా గొడవలు జరిగి దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే వివాహేతర సంబంధాలూ హత్యలకు కారణమవుతున్నాయి. తమ సంబంధానికి ఉన్న అడ్డును తొలగించుకునే క్రమంలో భర్త/భార్యను చంపేస్తున్నారు. చాలా వరకు ఆవేశంలో హంతకులుగా మారుతున్నారు. దీంతో హత్యకు గురైన వ్యక్తి కుటుంబం, హత్య చేసిన వ్యక్తుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

పెద్ద దిక్కును కోల్పోయి..

హత్యకు గురైన వ్యక్తుల కుటుంబాలతో పాటు హత్య కేసుల్లో జైలుకు వెళ్లిన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అరెస్టై జైలుకు వెళ్లిన వారిని బెయిల్‌పై బయటికి తీసుకు రావడానికి నెలల తరబడి కుటుంబ సభ్యులు అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. హంతకులుగా సమాజం వారిని దగ్గరకు రానీయని పరిస్థితి ఉంటోంది. వారి మూలంగా కుటుంబ సభ్యులు కూడా బయట తిరగడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు హత్యకు గురైన కుటుంబాలు ప్రతీకార చర్యలకూ వెనుకాడడం లేదు. దీంతో భయంభయంగా బతకాల్సిన పరిస్థితి ఉంటోంది. చాలా వరకు హత్య కేసుల్లో బాధితులు, నిందితులు అందరూ పేదవారే ఉంటున్నారు. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబం ఇబ్బందుల్లోకి నెట్టబడుతుండగా.. జైలుకు వెళ్లిన వారి కుటుంబం కూడా అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది.

శిక్షలు పడుతున్నా..

హత్య కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడుతున్నాయి. హత్య జరిగి, కేసులో అరెస్టయిన నాటి నుంచి నిందితులను సమాజం హంతకులుగానే చూసి, దగ్గరకు రానీయకపోవడమూ పెద్ద శిక్ష అవుతోంది. కేసు నుంచి బయటపడేందుకు ఎన్ని డబ్బులు ఖర్చు చేసినా ఆధారాలు దొరికి శిక్షలు పడుతున్నాయి. దీంతో మరికొన్నేళ్లు జైలు జీవితం అనుభవించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఏటా నాలుగైదు కేసుల్లో జీవిత ఖైదు విధిస్తున్నారు. శిక్షలు చూసైనా కేసులు తగ్గకపోవడంతో ఆందోళన కలిగించే అంశం.

బల్దియా ఎఫ్‌బీవోపై సస్పెన్షన్ వేటు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియాలో విధులు నిర్వహిస్తున్న ఫిల్టర్ బెడ్ ఆపరేటర్(ఎఫ్‌బీవో) శ్యాంపై సస్పెన్షన్ వేటు పడింది. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ స్పందన ఈ చర్య తీసుకున్నారు. డిసెంబర్ 10న రాత్రి జాతీయ రహదారి పక్కనగల ఫిల్టర్ బెడ్, గడీ రోడ్‌లోని వాటర్‌ట్యాంక్, బుర్ర మత్తడి, వాటర్ వర్క్ కార్యాలయం వద్ద నుంచి బల్దియాకు సంబంధించిన సుమారు రూ. 15 లక్షల విలువ చేసే పాత సామగ్రిని లారీలో తరలించిన విషయం తెలిసిందే. ఈ విషయం వెలుగులోకి రావడంతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి విచారణ జరిపారు. దీనికి ఎఫ్‌బీవోనే బాధ్యుడని విచారణలో తేలింది. అంతేకాకుండా వాటర్‌వర్క్ కార్యాలయంలో 2022లో ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 1.50 లక్షల చొప్పున తీసుకుని ఐదుగురు ఔట్ సోర్సింగ్ కార్మికులను విధుల్లో చేర్చుకున్నారని కార్మికులే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 20న అధికారులు విచారణ చేయగా నిజమేనని తేలింది. ఈ రెండు ఘటనలపై కలెక్టర్ సీరియస్ కావడంతో ఆయన ఆదేశాల మేరకు శ్యాంపై వేటు వేస్తూ మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ పాత సామగ్రిని తరలించినప్పుడు తాను అక్కడ ఉన్నది వాస్తవమేనని, కానీ ఆ సామగ్రిని అమ్ముకున్నది తాను కాదని సస్పెన్షన్‌కు గురైన శ్యాం 'సాక్షి'తో పేర్కొన్నాడు. తాను కార్మికులనుంచి డబ్బులు తీసుకోలేదని, కొందరు కక్షపూరితంగా తనను బలి చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా మహేశ్ కుమార్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా మహేశ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన శ్రీహరిరాజు బాన్సువాడకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నిజామాబాద్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన మహేశ్ కుమార్ పదోన్నతిపై వచ్చారు.

న్యూస్‌రీల్

నేడు మెగా యోగా శిబిరం ప్రారంభం

కామారెడ్డి అర్బన్: భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే మెగా యోగా శిబిరం శనివారం ప్రారంభం కానుంది. జిల్లాకేంద్రంలోని జయశంకర్ కాలనీలోగల ప్రాబెల్స్ హైస్కూల్‌లో మూడు రోజుల పాటు రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు శిబిరం కొనసాగనుంది. హరిద్వార్‌లోని పతంజలి యోగా విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ స్వామి పరమార్థదేవ్ మూడు రోజుల పాటు శిబిరంలో అందుబాటులో ఉండి, యోగా తరగతులు నిర్వహిస్తారని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రతినిధి అంజయ్య తెలిపారు. యోగా తరగతులతో పాటు ఆధ్యాత్మిక, దేశభక్తి, స్వదేశీ వంటి అంశాలపై ఆయన ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఆయన జిల్లాకేంద్రంలోని ఆర్‌కే, సాందీపని, శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్ విద్యార్థులతో వేరువేరుగా ముఖాముఖి నిర్వహిస్తారని తెలిపారు.

పీజీ పరీక్షలు ప్రారంభం



భిక్కనూరు : తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పీజీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్ పరీక్షలను పరిశీలించారు. ఉదయం సెషన్‌లో నిర్వహించిన మొదటి సెమిస్టర్ పరీక్షలకు 169 మంది విద్యార్థులకుగాను 162 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షలకు 159 మంది హాజరు కావాల్సి ఉండగా 155 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు.

కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని లయోలా హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా కబడ్డీ పురుషుల జట్టును ఎంపిక చేశారు. ఈ విషయాన్ని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 4నుంచి ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు పాల్గొంటుందన్నారు.

జట్టు వివరాలు:

వి.రవికుమార్, హెచ్.వంశి, పి.సందీప్‌కుమార్, డి.నవీన్, విష్ణువర్ధన్‌రావు, ఆంజనేయులు, యు.అజయ్‌కుమార్, శివస్వామి, ఎస్.అజయ్‌కుమార్, కె.అభిలాష్‌గౌడ్, ఎస్.శ్రావణ్‌రెడ్డి, ఆర్.నాగశ్రీనివాస్. స్టాండ్ బైగా ఎం.విఠల్, ఎం.పవన్.

ఆంగ్ల ఉపన్యాస పోటీలో జిల్లా విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఇంగ్లిష్ ఎలక్యూషన్ కాంపిటీషన్‌లో జిల్లా విద్యార్థి ప్రతిభ చూపింది. కామారెడ్డి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సనా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి అనుకూలంగా లేని బీడు భూముల్లో రైతులు సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేసి 25 ఏళ్ల వరకు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి 4 ఎకరాల వరకు భూమి అవసరం అవుతుందని తెలిపారు. 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం వరకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం ఆసక్తిగలవారు ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు రెడ్‌కో వెబ్‌సైట్‌లోగాని 63049 03933, 90005 50974 నంబర్లలోగాని సంప్రదించాలని సూచించారు.

'రుణాలను రికవరీ చేయాలి'



మహిళా సమాఖ్య ప్రతినిధికి పీవోఎస్ మిషన్ అందిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: స్త్రీనిధి రుణాలను పారదర్శకంగా వసూలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఇందుకోసం పాయింట్ ఆఫ్ సెల్(పాస్) మిషన్లను ఉపయోగించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహిళా సమాఖ్య ప్రతినిధులకు పాస్ మిషన్లను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటిసారిగా పట్టణ ప్రాంతాల్లోని సమాఖ్య సభ్యులకు పాస్ మిషన్‌లను అందిస్తున్నామన్నారు. స్త్రీనిధికి సంబంధించిన రుణాలు సులభంగా, పారదర్శకంగా, బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పాస్ యంత్రాల ద్వారా వాయిదాలు చెల్లించవచ్చని స్వయం సహాయక సంఘాల సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ కిరణ్ కుమార్, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం

- నేటి నుంచి అమలులోకి..
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



మహమ్మద్‌నగర్‌లో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

నిజాంసాగర్(జుక్కల్): పదోతరగతి పరీక్షల కోసం ప్రత్యేక తరగతుల ద్వారా సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించాలని సర్కారు నిర్ణయించింది. ఇది శనివారంనుంచి అమలులోకి రానుంది. వచ్చేనెల 20వ తేదీ వరకు అల్పాహారం అందించనున్నారు. ఈ మేరకు సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నత పాఠశాలల్లోని వంట ఏజెన్సీల నిర్వాహకులకే అల్పాహారం అందించే బాధ్యతను అప్పగించింది.

6,910 మంది విద్యార్థులకు..

జిల్లాలోని 187 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6,910 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరికి రోజూ ఉదయం 8 గంటల నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలనుంచి చాలా మంది విద్యార్థులు ఉదయం 7 గంటలకే ఇంటినుంచి బయలుదేరుతున్నారు. ప్రత్యేక తరగతులు పూర్తయ్యాక ఇంటికి చేరేసరికి రాత్రి 7 గంటలు దాటుతోంది. చాలామంది విద్యార్థులు సాయంత్రం ఆకలితో ఇబ్బందిపడుతూ చదువుపై సరిగా దృష్టి సారించలేకపోతున్నారు. విద్యార్థుల బాధను అర్థం చేసుకున్న సర్కారు వారికి సాయంత్రం పూట అల్పాహారం అందించాలని నిర్ణయించింది. ఒక్కో విద్యార్థికి అల్పాహారం అందించినందుకు వంట ఏజెన్సీ నిర్వాహకులకు రూ. 15 చొప్పున అందించనుంది. ఆకలి బాధ తీరనుండడంతో విద్యార్థులు చదువులపై దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

వంద కాదు.. యాభై పడకలే!



దోమకొండలోని సీహెచ్‌సీ భవనం

- దోమకొండ సీహెచ్‌సీ స్థాయి పెంపులో అన్యాయం
- యాభై పడకలకే పరిమితం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఫైల్‌పై సంతకం చేసిన సీఎం

కామారెడ్డి టౌన్ : దోమకొండ మండల కేంద్రంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను వంద పడకలకు పెంచడానికి సంబంధించిన ఫైల్ తిరస్కరణకు గురైంది. సీహెచ్‌సీని యాభై పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి అంగీకరించిన సీఎం.. మరో ఫైల్ తయారు చేయించి సంతకం చేశారు. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గతంలో సీఎంను కోరారు. అనంతరం ఆస్పత్రి భవన నిర్మాణం కోసం ముత్యంపేట రోడ్‌లో 4 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ దోమకొండ పంచాయతీ తీర్మానం కూడా చేసింది. ఆస్పత్రి స్థాయి పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ కూడా ఆమోదం తెలిపింది. ఈ ఫైల్ ఇటీవల తుది సంతకం కోసం సీఎం చాంబర్‌కు చేరింది. సీఎం రేవంత్‌రెడ్డి సంతకం చేస్తారని, దోమకొండలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటవుతుందని అందరూ భావించారు. అయితే సీఎం అనూహ్యంగా ఈ ఫైల్‌ను తిరస్కరించి.. 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి అనుమతిస్తూ మరో ఫైల్ సిద్ధం చేయించి సంతకం చేశారు. ఈ ప్రక్రియ రెండు రోజుల క్రితం పూర్తయ్యిందని వైద్య శాఖ అధికారుల ద్వారా తెలిసింది. సర్కారు నిర్ణయంతో రాజకీయ నేతలు, ప్రజలు నిరాశకు గురవుతున్నారు. వంద పడకల ఆస్పత్రిగా మారిస్తే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేడు బాన్సువాడకు హైకోర్టు జడ్జి రాక

బాన్సువాడ : హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు శనివారం ఉదయం బాన్సువాడకు రానున్నారు. ఆయన కోర్టు భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఎల్లారెడ్డికి బయలుదేరి వెళ్తారు. హైకోర్టు జడ్జి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎల్లారెడ్డికి..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టుకు శనివారం హైకోర్టు జడ్జీలు శ్రీనివాస్‌రావు, అలిశెట్టి లక్ష్మీనారాయణ రానున్నారు. ఈ విషయాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిఫ్ కోర్టు ప్రాంగణంలో నూతనంగా కోర్టు భవనాల నిర్మాణంతో పాటు న్యాయమూర్తుల నివాస గృహాల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

ఆదమరిస్తే అంతే..



తాడ్వాయి నుంచి చందాపూర్ వెళ్లే దారిలో దెబ్బతిన్న కాజ్‌వే

తాడ్వాయి నుంచి చందాపూర్ వెళ్లే రహదారిపై చందాపూర్ గ్రామ సమీపంలో ఉన్న కాజ్‌వే ఒకవైపు దెబ్బతింది. అక్కడ ఓ కర్రను, హెచ్చరికగా ఓ స్టాండ్‌ను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. రోడ్డంతా బాగుంది కదా అని గమనించకుండా ఈ ప్రాంతంలో వేగంగా వెళ్తే ఎదురెదురుగా వాహనాలు వచ్చినపుడు ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

'చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'



మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగరాణి

భిక్కనూరు: ప్రతి రైతు సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి నాగరాణి సూచించారు. శుక్రవారం భిక్కనూరు రైతు వేదికలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని రైతులకు అసైన్‌మెంట్ భూములు, విత్తనాలు, విద్యుత్, మార్కెటింగ్ వంటి చట్టాల గురించి వివరించారు. రైతు విత్తనం కొనుగోలు మొదలు పంటను మార్కెట్‌లో అమ్ముకునే వరకు ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలను అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు న్యాయంగా రైతులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతు వేదికలోని అగ్రి లీగల్ క్లినిక్ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శోభ, ఏఈవో ఆనంద్, పీఎల్వీలు నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాత నేరస్తుల బైండోవర్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గండివేట్ తండాకు చెందిన నాటుసారా కేసుల్లో ఉన్న పాత నేరస్తులను శుక్రవారం తహసీల్దార్ సతీశ్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ తెలిపారు. తండాకు చెందిన రమావత్ దోలీ, విస్తావత్ సోమ్లాను బైండోవర్ చేశామన్నారు. బైండోవర్‌ను రెండేళ్ల కాలంలో ఉల్లంఘిస్తే రూ.20 లక్షల జరిమానా విధిస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): అక్రమంగా తరలిస్తున్న 25 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, తమను చూసి బొలెరో వాహనంతో పరారవుతున్న వారిని పట్టుకుని తనిఖీ చేయగా రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

నస్రుల్లాబాద్: సీజ్ చేసిన సుమారు 10 ట్రాక్టర్ల ఇసుకను ఫిబ్రవరి 4న బహిరంగ వేలం వేస్తున్నామని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ వేలంలో ఎక్కువ నగదుకు పాడుకున్న వారికి ఇసుక ఇస్తామని, పాడుకున్న మొత్తాన్ని వాల్టా బ్యాంకులో జమచేసి రసీదును తహసీల్ కార్యాలయంలో అందించాల్సి ఉంటుందన్నారు.

విద్యార్థినికి అభినందన

భిక్కనూరు: మండల స్థాయిలో ఫిజికల్ సైన్స్ ప్రతిభా పరీక్షలో మొదటి స్థానం సాధించిన జంగంపల్లి ఉన్నత పాఠశాలకు పదో తరగతి విద్యార్థిని కావేరిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 4న కామారెడ్డిలో నిర్వహించే జిల్లా స్థాయి ప్రతిభా పోటీల్లో కావేరి పాల్గొననుందని తెలిపారు.

సాయిచరణ్ ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

నిజామాబాద్‌నాగారం: మిషన్ భగీరథ (ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈఈ కే సాయిచరణ్ ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టి కారణాలను తేల్చాలని తోటి ఉద్యోగులు కోరారు. జస్టిస్ ఫర్ సాయిచరణ్ అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని మిషన్‌భగీరథ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నిరసనలో మిషన్ భగీరథ డీఈఈ మున్యానాయక్, ఈఈ రాకేశ్, ఇంజనీర్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు కొత్త సారథులు..!

- మారిన 'బైలా' ప్రకారం ఎన్నికల నిర్వహణకు అధికారులు సమాయత్తం
- ఇప్పటివరకు ఒకే ఏడాదిపాటు పదవుల్లో కొనసాగిన సంఘం సభ్యులు
- ఇకపై మూడేళ్ల పదవీ కాలం


మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలకు కొత్త సారథులు రానున్నారు. సంఘ సభ్యులతోపాటు గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాటు కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారులను ఎన్నుకునేందుకు సెర్ప్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. నూతనంగా గ్రామ, మండల, జిల్లా సమాఖ్య సభ్యులను ఎన్నుకునే తీరుపై ఇదివరకే జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు ఏపీఎం, సీసీలకు తగిన శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన అధికారులు మహిళా సంఘాల సభ్యులతోపాటు వీవోఏలకు విడతలవారీగా అవగాహన కల్పించారు. మార్చి నెలాఖరులోగా జిల్లాలో గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు నూతన సభ్యుల ఎన్నిక ప్రక్రియ పూర్తిచేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

అమలులోకి నూతన బైలా..

ఇదివరకు గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలోని పదాధికారుల(అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి) పదవీ కాలం కేవలం ఒక ఏడాది ఉండేది. పదాధికారుల పదవీకాలం కేవలం ఒక్క ఏడాదిపాటు మాత్రమే ఉండడం వల్ల వారికి పదవీ బాధ్యతలపై అవగాహన కలిగేలోపే పదవీకాలం పూర్తవుతుందని గ్రహించిన గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు నూతనంగా బైలా(ఉపవిధులు)ను రూపొందించారు. నూతన బైలా ప్రకారం పదాధికారుల పదవీ కాలం మూడేళ్లకు పొడగించారు. దీంతోపాటు అవిశ్వాస తీర్మానం ద్వారా సమాఖ్యలోని సభ్యులను తొలగించే అవకాశం కూడా కల్పించారు. పదవీ కాలం పెరగడం వల్ల సమాఖ్యలపై మహిళలకు మరింత పట్టు వస్తుందని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల మహిళల ఆర్థికాభివృద్ధి మరింత మెరుగుపడనుందని వారు పేర్కొంటున్నారు.

రహదారి భద్రత మనందరి బాధ్యత

- డీటీవో శ్రీనివాస్ రెడ్డి
- ముగిసిన రహదారి భద్రత మాసోత్సవాలు


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీటీవో శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి క్రైం: రహదారి భద్రత మనందరి బాధ్యత అని జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని నర్సన్నపల్లి వద్దనున్న రవాణా శాఖ కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల వాహనాలు నడిపే డ్రైవర్‌లతో పాటు అన్ని రంగాల్లోని వారిని కలుపుకొని మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రత అనే అంశంపై వివరించేలా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మాసోత్సవాల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టిన పోలీస్ కళాబృందం సభ్యులను సన్మానించారు. ఎంవీఐలు జె.శ్రీనివాస్, నాగలక్ష్మి, ఏఎంవీఐలు సిబ్బంది పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు


రామారెడ్డిలో కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు


ఎల్లారెడ్డిలో పూజలు చేస్తున్న భక్తులు


పిట్లం ఆర్యవైశ్య భవనంలో కార్యక్రమానికి హాజరైన ఆర్యవైశ్య మహిళలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యే పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో భాగంగా అమ్మవారికి అభిషేకాలు చేశారు.

రామారెడ్డి: ఆర్యవైశ్య కుల దేవత వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మౌనం పాటించి పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య రాజకీయ విభాగం ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు పడిగెల శ్రీనివాస్, రామారెడ్డి వైశ్య సంఘం అధ్యక్షుడు చీకోటి మురళీధర్, గౌరవాధ్యక్షుడు కర్నాకర్, వైశ్య సంఘం సెక్రెటరీ పాత రమేశ్, కోశాధికారి కూకట్ల కేదార్, కొమ్మ శంకర్‌గుప్తా, కొమ్మ సత్యం రాజేశ్వర్, శంకర్ పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో శుక్రవారం వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బేగంపూర్ శివారులో సంయుక్త సర్వే


సర్వే చేస్తున్న అటవీ, రెవెన్యూ శాఖాధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బేగంపూర్ శివారులో శుక్రవారం అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్త సర్వే నిర్వహించారు. ఇటీవల బేగంపూర్ గ్రామానికి చెందిన పలువురి భూములను, అటవీ భూమిగా గుర్తించారు. దీంతో బాధితులు కామారెడ్డి ప్రజావాణిలో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి సంయుక్త సర్వే నిర్వహించాలని అటవీ, రెవెన్యూ శాఖాధికారులను ఆదేశించడంతో గ్రామానికి చేరుకుని సర్వే చేపట్టారు. సర్వే నిర్వహిస్తుండగా రైతులు, అధికారులకు వారి సమస్యను చెప్పుకున్నారు. మా భూములకు 1983 నుంచి పట్టాలు ఉన్నాయని, గత ప్రభుత్వ హయాంలో కూడా కొత్త పాస్ పుస్తకాలు, రైతుబంధు కూడా వచ్చిందని, కాని ఈ మధ్య భూములకు లాక్ వేశారని అధికారులకు రైతులు వివరించారు. సర్వే నివేదిక ఉన్నత అధికారులకు అందజేస్తామని రైతులకు అటవీ, రెవెన్యూ అధికారులు తెలిపారు. సర్వేయర్ హైమదీ బేగం, డోంగ్లి సర్వేయర్ వెంకటి, బీట్ ఆఫీసర్ చరణ్, ఆర్‌ఐ అంజయ్య, మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ఆకస్మిక తనిఖీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి రైల్వేస్టేషన్‌ను డివిజన్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) లోకేష్ విశ్నవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని సమస్యలు స్టేషన్ సూపరింటెండెంట్ సత్యంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి ప్రజలకు ఇబ్బంది లేకుండా మున్సిపల్ అధికారులతో చర్చించి రైల్వే మెయిన్ గేట్, స్టేషన్‌లో వాహనాల పార్కింగ్ షెడ్ల పనులను త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. రైల్వే అధికారులు, సిబ్బంది రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఫుడ్ పాయిజన్ వార్త అవాస్తవం

కామారెడ్డి టౌన్/బాన్సువాడ: బీర్కూరు మండలం 9వ తరగతి విద్యార్థి అరుణ్ కుమార్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని ఫుడ్‌పాయిజన్‌తో అనారోగ్యానికి గురైనట్లు ఓ వెబ్ న్యూస్‌లో వచ్చిన వార్త అవాస్తమని డీఈవో రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం స్కూల్ హెడ్‌మాస్టర్‌తో కలిసి బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థితో స్వయంగా మాట్లాడి, విచారణ చేపట్టినట్లు తెలిపారు. అరుణ్ స్కూల్‌కి రావట్లేదని, మధ్యాహ్న సమయంలో భోజనం చేశాడని చెప్పడంతో స్కూల్‌లోనే మధ్యాహ్నం భోజనం చేశాడని ఫేక్ న్యూస్ ప్రచురించి సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేశారని అన్నారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు.

కార్యకర్తలను బెదిరిస్తే సహించేదిలేదు


సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

లింగంపేట(ఎల్లారెడ్డి): బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులను కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తే సహించేదిలేదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో సంక్షేమ పథకాలపై ప్రశ్నించిన బీఆర్‌ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫోన్ చేసి బెదిరించారని, అలాగే సోషల్ మీడియాలో పోస్టులు పెడితే బెదిరిస్తున్నారన్నారు. ఈ పద్ధతి మానుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, గాండ్ల నర్సింలు, బండి నర్సింలు, పరంధాములు, సందీప్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

3న వసంత పంచమికి ఏర్పాట్లు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ సరస్వతి ఆలయంలో ఈ నెల 3న వసంత పంచమి సందర్భంగా అమ్మవారి దర్శనం, అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త పి.విఠల్ పటేల్ తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి అమ్మవారి దర్శనం, ప్రతి గంటకు ఒక బ్యాచ్ చొప్పున సామూహిక అక్షరభ్యాసం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పేర్కొన్నారు. దాతలు ముందుగా సంప్రదించవచ్చన్నారు.

మండల స్థాయి ప్రతిభా పరీక్ష



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల స్థాయి ఫిజికల్ సైన్స్ ప్రతిభా పరీక్షను శుక్రవారం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు ఎంఈవో షౌకత్అలీ తెలిపారు. ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో 17 ఉన్నత పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తాడ్వాయిలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రామస్వామి మాట్లాడుతూ.. ఫైనల్ లిస్టు విద్యార్థులు ఫిబ్రవరి 4న జరిగే జిల్లాస్థాయి ప్రతిభా పరీక్షలో పాల్గొంటారన్నారు. హెచ్‌ఎం కల్యాణి, ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, గిర్మబోయి, శ్రీకాంత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్: బంజరు భూములు, వ్యవసాయానికి అనుకూలంగా లేని భూముల్లో సౌరశక్తిని ఉత్పత్తి చేసి ఆదాయాన్ని పొందాలనుకునే అర్హులు, ఆసక్తి కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ రెడ్కో రైతులు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, రైతు సమూహాలు, నీటి వినియోగదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలు, పంచాయతీలు, గ్రామ సంస్థలు, మండల సమాఖ్యలు, డెవలపర్స్ (రైతుల భూమి లీజు ఒప్పందం) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల భూమి అవసరం ఉంటుందని తెలిపారు. టీజీ ఎన్‌పీడీసీఎల్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నిర్ణయించిన టారిఫ్ ప్రకారం విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందన్నారు. బంజరు భూములు, వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను ఆదాయ వనరులుగా మార్చుకుని, 25 ఏళ్లపాటు రైతులు నిలకడైన ఆదాయం పొందుతారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు. మరిన్ని వివరాలకు www.tgredco. telangana.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని సూచించారు. దరఖాస్తులకు ఈనెల 22వ తేదీ చివరి రోజని, ఏవైనా సందేహాలు ఉంటే టీజీ రెడ్కో డీజీఎం (63049 03933), జీఎం (90005 50974) నంబర్లను సంప్రదించాలని ఎస్ఈ సూచించారు.

క్రైం కార్నర్

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని చింరాజ్‌పల్లికి చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి శుక్రవారం తెలిపారు. నందిపేట గ్రామానికి చెందిన నాగనాథ్ అలియాస్ నగేశ్ మేస్త్రి తన వద్దకు కూలీ పనికి వచ్చిన బాలికను చేయి పట్టి లాగి అసభ్యంగా ప్రవర్తించడంతో ఆయనపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు.

యువతి మృతిపై విచారణ

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన యువతి మృతిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన శుక్రవారం విచారణ చేపట్టారు. అసలు ఏం జరిగింది? నకిలీ వైద్యుడిని సంప్రదించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని యువతి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. యువతి మృతికి కారణమైన ఆర్‌ఎంపీతోపాటు యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంట స్థానిక పీహెచ్‌సీ సెంటర్ వైద్యులు ప్రవీణ్‌రెడ్డి, వేణుగోపాల్, జేమ్స్, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

తల్లికి బాలుడి అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని పెట్రోల్ బంక్ వద్ద తప్పి పోయిన రెండేళ్ల చిన్నారిని పోలీసులు తల్లికి అప్పగించారు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన రెండేళ్ల బాలుడు పెట్రోల్ బంకు వద్ద రోదిస్తూ కనిపించడంతో స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు సోషల్ మీడియాలో బాలుడి ఫొటోను షేర్ చేయడంతో తల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. విచారణ అనంతరం పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి


ఉత్తమ డ్రైవర్‌లతో డీటీవో ఉమామహేశ్వర్‌రావు

ఖలీల్‌వాడి: ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని జిల్లా రవాణా శాఖాధికారి ఉమామహేశ్వర్ రావు అన్నారు. రోడ్డు భద్రతామాసోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని రీజియన్ కార్యాలయంలో శుక్రవారం ప్రమాద రహిత సర్వీస్ రికార్డు ఉన్న డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం జ్యోత్స్న, ఎంవీఐ కిరణ్‌కుమార్, డిప్యూటీ ఆర్‌ఎంలు వి శంకర్, ఎన్ సరస్వతి, పర్సనల్ ఆఫీసర్ పద్మజ, డిపో మేనేజర్లు బి ఆనంద్, ఎన్ సాయన్న, శ్రీనివాస్, ఆర్ సరితాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లు వీరే..

రీజియన్ పరిధిలో ప్రమాద రహిత సర్వీస్ రికార్డు ఉన్న సీనియర్ డ్రైవర్లుగా ఎస్.నారయణ(ఆర్మూర్), సి.ముత్తెన్న(ఆర్మూర్), అబ్బాస్‌అలీ(బాన్సువాడ) గుర్తింపు పొందారు. అలాగే ఆర్మూర్ డిపోకు చెందిన వి సుదర్శన్, కె నర్సయ్య, బీఎల్ రెడ్డి, బాన్సువాడ డిపోకు చెందిన బి బలరాం, పి సుభాష్, పీవీ రెడ్డి, బోధన్ డిపోకు చెందిన ఎండీ ముఖీం, ఎల్‌ఏపీ రెడ్డి, ఎస్‌డీ హైమద్, కామారెడ్డి డిపోకు చెందిన ఎం.ఇంతియాజ్ అలీ, అబ్దుల్ జావీద్, ఏఎల్‌ఎన్ గౌడ్, నిజామాబాద్-1 డిపోకు చెందిన బి రాజేందర్, ఎస్ సాయిలు, వైఎస్ నారాయణ, నిజామాబాద్-2కు చెందిన టి ముత్తెన్న, పి.సుధాకర్, మీర్ అన్వర్ అలీలు ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికయ్యారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో న్యాయస్థానం ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 15 మందికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరిచామన్నారు. న్యాయమూర్తి 10 మందికి మొత్తం రూ.125,500 జరిమానా విధించారని, అలాగే ఒకరికి మూడు రోజులు, నలుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. సదరు వ్యక్తి ఇప్పటి వరకు నాలుగుసార్లు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడి జరిమానా చెల్లించాడన్నారు.

చైన్ స్నాచర్‌కు 15 నెలలు..

బాన్సువాడ రూరల్: పాత బాన్సువాడ రోడ్డులోని బేతాళస్వామి గుడి సమీపంలో 2023 నవంబర్ 19న చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నాగారం నవీన్ అనే వ్యక్తికి బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి టీఎస్‌పీ భార్గవి 15నెలల జైలుశిక్ష, రూ.100 జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. బీర్కూర్ మండలం దామరంచ గ్రామానికి చెందిన ఎర్రోల్ల హన్మావ్వ మెడలోని చైన్‌ను నవీన్ తెంపుకొని పారిపోతుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 15 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

యువతి అదృశ్యం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన 21 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఎస్సై రజినీకాంత్ శుక్రవారం తెలిపారు. గురువారం మధ్యాహ్నం షాపింగ్ కోసం ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్లు వెతికారన్నారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన చల్లాగరిగె రంజిత్ ఈ నెల 24న వన్నెల్(బి) చౌరస్తా వద్ద తన ఐ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాల్కొండ పోలీసులు సీఈఐఆర్ పద్ధతి ద్వారా కనుగొని బాధితుడికి ఫోన్‌ను శుక్రవారం అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ వాసుదేవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకులో చోరీకి యత్నం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ కూడలి వద్ద ఉన్న ఎస్‌బీఐలో గురువారం అర్ధరాత్రి శ్యామ్ అనే వ్యక్తి చోరీకి యత్నించాడు. ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బ్యాంకులో చోరీ చేసేందుకు వచ్చిన శ్యామ్ షట్టర్, అద్దాలు పగులగొట్టాడని చోరీ చేయడం సాధ్యం కాకపోవడంతో తిరిగి వెళ్లిపోయాడన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి విచారించగా చోరీకి యత్నించినట్లు ఒప్పుకున్నాడన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


బోధన్‌రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మండలంలోని సిద్ధాపూర్ శివారులో పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

చెరువులో యువకుడి మృతదేహం


సాజన్ (ఫైల్)

రుద్రూర్ : మండలంలోని అక్బర్‌నగర్ చెరువులో శుక్రవారం రాత్రి యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మధ్యాహ్నం నుంచి చెరువు కట్టపై బైక్ ఉండడంతో స్థానికులు అనుమానంతో పరిశీలించగా చెరువులో మృతదేహం కనిపించింది. గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి బైక్‌పై బయటికి వెళ్లిన సాజన్ మృతదేహంగా గుర్తించారు. కుటుంబ సభ్యులు గురువారం సాజన్ కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం సాయంత్రం అక్బర్‌నగర్ చెరువులో శవమై కనిపించాడు. ఎస్సై సాయన్న ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. సాజన్ బట్టలు ఉతికేందుకు వెళ్లి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి సోదరుడు షేక్ కబీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో రక్తపు మరకలు



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రాథమిక పాఠశాల ఆవరణలో రక్తపు మరకలు కనిపించడం కలకలం రేపింది. రోజూలాగే శుక్రవారం పాఠశాల ఆవరణను ఊడ్చేందుకు వెళ్లిన స్వీపర్‌కు తరగతి గది ముందు రక్తం కనిపించడంతో స్థానికులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పాఠశాల సమీపంలో ఉండే తండ్రీకొడుకులు గురువారం రాత్రి గొడవ పడగా కుమారుడి కాలికి గాయమై రక్తస్రావమైందని నిర్ధారించారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.